క్లుప్తంగా

సుఖీభవ పథకానికి 9,248 మంది అర్హులు

కొనకనమిట్ల: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి మండలంలో 9,248 మంది రైతులు అర్హులుగా గుర్తించామని, వారికి త్వరలో ప్రభుత్వం అందించే సుఖీభవ నిధులు జమ చేస్తామని వ్యవసాయాధికారి కె.ప్రకాష్ రావు తెలిపారు. బుధవారం మండలంలోని నాగంపల్లి, సలనూతల గ్రామాల్లో రైతులతో సమావేశమయ్యారు. రైతులకు వ్యవసాయంలో తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు అందజేశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మొదటి విడత రైతుల ఖాతాల్లో రూ.7 వేలు, రెండో విడతలో రూ.7 వేలు, మూడో విడతలో రూ.6 వేలు సుఖీభవ నగదు జమ చేస్తారని ఏఓ స్పష్టం చేశారు. పొలం లేని వాళ్లకు సీసీఆర్సీ కార్డు ఉంటే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ, విత్తనాలు, పంట నష్ట పరిహారం అందుతుందని చెప్పారు. అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వర్తిస్తుందన్నారు. ఏఈఓలు రవికాంత్, విక్రం, తనూజ, ప్రశాంతకుమార్, రైతులు పాల్గొన్నారు.

పీఎస్ కాలనీ వాసులకు నీరు సరఫరా



కమిషనర్ సమక్షంలో నీరు పట్టుకుంటున్న మహిళలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో నీటి సమస్యతో మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన మున్సిపల్ కమిషనరు నారాయణరావు తమ సిబ్బందితో కాలనీకి వెళ్లి నీటి సమస్యను పరిశీలించారు. మున్సిపల్ కాంట్రాక్టు సిబ్బంది ధర్నా చేస్తుండటంతో నీటి సరఫరా చేసేవారు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో తమ సిబ్బందితో కాలనీ ప్రజలకు నీరు సరఫరా చేసి సమస్యను పరిష్కరించారు.

కందులాపురంలో పారిశుధ్య పనుల పరిశీలన



కందులాపురంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కంభం: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ వీరభద్రాచారి సూచించారు. మండలంలోని కందులాపురం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఉదయం ఆయన పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి పారిశుధ్య పనులపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ విజయలక్ష్మి, కార్యదర్శి జ్యోష్యులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఇంటింటి ప్రచారం



ఔరంగబాదు గ్రామంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంఈఓ

కంభం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ సత్తార్ తల్లిదండ్రులకు తెలిపారు. మండలంలోని ఔరంగబాదు గ్రామంలో మంగళవారం రాత్రి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తామన్నారు. కార్యక్రమంలో జంగంగుంట్ల కాంప్లెక్స్ చైర్మన్ గని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు బస్సుల ప్రారంభం

మార్కాపురం టౌన్: మార్కాపురం ఆర్టీసీ డిపో పరిధిలో నూతనంగా వచ్చిన రెండు బస్సులను బుధవారం డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు.. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. మార్కాపురం నుంచి మాచర్లకు పల్లెవెలుగు, మార్కాపురం నుంచి ఒంగోలుకు ఎక్స్‌ప్రెస్ సర్వీసును ప్రారంభించారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని డీఎం కోరారు. ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ సమీక్షకు హాజరు కావాలి

తాళ్లూరు: బాపట్ల జిల్లా కారంచేడులో దళితులపై 40 ఏళ్ల క్రితం జరిగిన మారణకాండపై చీరాలలో గురువారం జరగనున్న దళిత ఉద్యమ సమీక్షకు ప్రతి దళితుడు హాజరై విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య కోరారు. మండల కేంద్రం తాళ్లూరు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం ఆయన మాట్లాడారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో చీరాలలో జరగనున్న సమీక్షకు దళితులు తరలి రావాలని అంజయ్య కోరారు.

కృష్ణా జెడ్పీ చైర్మన్‌పై దాడి అమానుషం



మాట్లాడుతున్న రంగస్వామి గౌడ్, గౌడ సంఘ సభ్యులు

మార్కాపురం: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికపై దాడి అమానుషమని, జిల్లా ప్రథమ పౌరురాలుపై దాడి దుర్మార్గమని మార్కాపురం గౌడ సంఘ అధ్యక్షుడు ఇల్లూరి రంగస్వామిగౌడ్, ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు గౌడ్, యూత్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాసులు గౌడ్ ఖండించారు. బుధవారం మార్కాపురం పట్టణంలో వారు పాత్రికేయులతో మాట్లాడారు. జిల్లాకు సంబంధించి చైర్మన్‌తో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు, నియోజకవర్గానికి వైఎస్సార్ సీసీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న హారికపై దాడి చేయడం మంచిపద్ధతి కాదన్నారు. బీసీ సామాజికవర్గంలోని గౌడ సామాజిక వర్గానికి చెందిన హారికపై చేసిన దాడిని తమ సంఘం తరపున ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటనపై బడుగు బలహీనవర్గాలకు చెందిన నాయకులందరూ ఖండించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే రాబోయే రోజుల్లో బీసీలకు రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గౌడ వర్గీయులందరూ ఈ విషయంలో ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీసీలకు ఎక్కడ అన్యాయం జరిగినా తాము సహించమని స్పష్టం చేశారు. సమావేశంలో శ్రీరంగం గుండ్లా వెంకటేశ్వర్లు, జూపల్లి వెంకటరావు, జి. రంగారావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి కుమ్మరాంకట్ట, వైఎస్సార్ సెంటర్ల మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరు, పారిశుధ్య కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా నిరసన తెలియజేస్తున్నామన్నారు. జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, క్యాటగిరీ వైజ్‌గా కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని, రిటైర్డ్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలనే డిమాండ్ల సాధన కోసం కార్మికులు ఐకమత్యంగా పోరాడతారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మురళి, రవి, చంటయ్య, మస్తాన్‌రెడ్డి, సలీమ్, రహమ్మతుల్లా, పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు, కమలమ్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

● డిప్యూటీ డీఈవో శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరెడ్డి

మార్కాపురం టౌన్: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని డిప్యూటీ డీఈవో ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఎస్సీబీసీ కాలనీలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలకు వనరులు సమకూర్చుకోవడంలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ఒకరికొకరు సహకరించుకోవాలని చెప్పారు. విద్యార్థుల ఆలోచన సరళిని గుర్తించి బోధన చేయాలన్నారు. డీవైఈవో స్థాయిలో నూరు శాతం సహకారం అందిస్తానని చెప్పారు. మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లోని నాలుగు ఉన్నత పాఠశాలలు, 14 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఎంఈవో కె.శార్యాణి, రిటైర్డు టీచర్లు జగన్నాథ్, నవరత్నం, వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, హెచ్‌ఎం టి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

భారీ గుంత.. ప్రయాణానికి చింత



రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత

కొమరోలు: అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహనదారులు, ప్రయాణికులను ప్రమాదంలోకి నెడుతోంది. కొమరోలు మండలం పామూరుపల్లి గ్రామ సమీపంలో శివాలయం ఎదురుగా ఉన్న ఈ గుంతను గమనించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి తీవ్రగాయాలపాలయ్యారు. పామూరుపల్లె గ్రామస్తులు గతంలో ఈ భారీ గుంతను తాత్కాలికంగా పూడ్చినప్పటికీ అడపాదడపా కురిసిన వర్షాలతో పరిస్థితి మొదటికొచ్చింది. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి భారీ గుంతను పూడ్పించి, ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల ప్రవర్తనపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కంభం సీఐ మల్లికార్జున

కంభం: పాఠశాలల్లో విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని కంభం సీఐ కే మల్లిఖార్జునరావు కోరారు. స్థానిక వాసవీ విద్యానికేతన్ లో బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, పోక్సో కేసులు, సైబర్ నేరాలు, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 శ్రీనివాసులు, కంభం ఎస్సై నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పే స్కేలు వర్తింపజేయాలి



సమస్యల గురించి తెలియజేస్తున్న వీఆర్‌ఏలు

గిద్దలూరు రూరల్: వీఆర్‌ఏలకు పే స్కేలు వర్తింపజేయాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని పాత తహశీల్దార్ కార్యాలయం భవనంలో బుధవారం వీఆర్‌ఏల సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగి ఉన్న వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా పదోన్నతి కల్పించాలని, నామినేషన్ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం గిద్దలూరు మండల అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దుగ్గెపోగు విక్టర్, మండల కార్యదర్శి శంకుల అల్లూరయ్య, పుల్లటి హిమాంబి, భూ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కులాంతర వివాహం



నూతన వధూవరులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

కంభం: ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం కులాంతర వివాహం నిర్వహించారు. మండలంలోని కందులాపురంలో నివాసం ఉంటున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన చెన్న క్రిష్ణయ్య అనే యువకుడు బేస్తవారిపేటలో నివాసం ఉంటున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓ యువతితో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో వారు ఎమ్మార్పీఎస్ నాయకులను ఆశ్రయించగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ పానుగంటి షాలెంరాజు, జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్, బీసీ సంఘం నాయకులు వేముల రాజు కుటుంబ పెద్దలతో మాట్లాడి ఇరు కుటుంబాల అంగీకారంతో వివాహం జరిపించారు. ఈ సందర్భంగా షాలెంరాజు మాట్లాడుతూ సమాజంలో ఉన్న కుల వ్యవస్థల్లో మార్పు రావాలంటే కులాంత వివాహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

బూత్ లెవల్ అధికారులకు అవగాహన సదస్సు



బూత్ లెవల్ అధికారులకు శిక్షణ ఇస్తున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి

కంభం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో తహసీల్దార్ వి.కిరణ్ అధ్యక్షతన బుధవారం బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు ఓరియంటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి యం.వెంకట శివరామిరెడ్డి పాల్గొని సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సూచనల ప్రకారం ఆర్‌పీ యాక్ట్ 1950 సెక్షన్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్‌లెవల్ అవేర్నెస్ గ్రూప్‌ల గురించి, బీఎల్‌ఓ యాప్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి బీఎల్‌ఓ కు ట్రెనింగ్ ప్రోగ్రాంకు సంబంధించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ షేక్ ఇబ్రహీం ఖలీల్, మాస్టర్ ట్రెనర్ మీనిగ చిన్న అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు కేపీ పరామర్శ



రంగాపురంలో విజయకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

అర్ధవీడు: ఇటీవల బ్రేన్‌డెడ్‌తో మరణించిన వీరభద్రాపురానికి చెందిన పోరెడ్డి ప్రసాద్‌రెడ్డి (30) తండ్రి భాస్కర్‌రెడ్డిని గిద్దలూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం ఇటీవల మార్కాపురం మండలం మిట్టమీదపల్లె సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆకవీటి విజయకుమార్ (25) తండ్రి మోహన్‌ను ఆయన స్వగ్రామం రంగాపురంలో పరామర్శించారు. కేపీతో పాటు ఎంపీపీ ఎం.వెంకటరావు, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం ఉపాధ్యక్షుడు రవికుమార్ యాదవ్, మండల కన్వీనర్ ఏరువ రంగారెడ్డి, రంగాపురం సర్పంచ్ నాగిరెడ్డి, పార్టీ నాయకులు జీ రామారావు, మర్రి పెద్దన్న, జీ గోపాల్, బీ రామకృష్ణ, బీ సర్వేశ్వరరావు, వై శ్రీనివాసులు, రమేష్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బీవీఎస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలంటూ వృద్ధుడి వేడుకోలు



వివరాలు తెలుపుతున్న పెద్దన్న

మార్కాపురం: మాయ మాటలతో తన ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకుని రోడ్డున పడేశారని, తనకు న్యాయం చేయాలని మార్కాపురం పట్టణానికి చెందిన వృద్ధుడు దండూరి పెద్దన్న అధికారులను కోరుతున్నాడు. బుధవారం ఆయన తన ఆవేదనను విలేకరులకు తెలిపాడు. కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన తాను సుమారు 30 ఏళ్ల నుంచి మార్కాపురంలో నివాసం ఉంటున్నానని చెప్పాడు. తన ఆస్తిని రక్త సంబంధీకులే మాయమాటలు చెప్పి రిజిస్ట్రేషన్ చేయించుకుని అవసాన దశలో వదిలేయడంతో తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. కరోనా సమయంలో తనతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. రోజూ భోజనానికి అలమటిస్తున్నాని, తనతో చేయించుకున్న అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరాడు. ఇటీవల గ్రీవెన్స్‌లో కూడా తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పెద్దన్న వివరించాడు.

రశీదులు లేకుండా విత్తనాలు కొనవద్దు



మాట్లాడుతున్న ఏఓ అబ్దుల్ రఫీక్

బేస్తవారిపేట: రశీదులు తీసుకోకుండా పురుగుమందులు, విత్తనాలు కొనుగోలు చేయవద్దని వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ అన్నారు. మండలంలోని ఎంపీ చెరువు, ఖాజీపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తీసుకున్న రశీదులు, ప్యాకెట్లు భద్రపరచుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో క్రాప్ ఇన్సూరెన్స్ మీసేవా కేంద్రాలో నగదు చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ఆదిగణేష్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యానవన పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

బేస్తవారిపేట: రైతులు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఉద్యానవన పంటలు సాగు చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు అన్నారు. మండలంలోని పెద్ద ఓబినేనిపల్లెలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో నాటుకున్న హార్టీకల్చర్ బుధవారం పంటలను పరిశీలించారు. పూలు, పండ్ల మొక్కల తోటలను నాటుకోవడంతో ప్రతి సంవత్సరం దిగుబడి పొందుతూ ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. ఉత్సాహం ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కే గురువరకుమార్, టీఏ సీహెచ్ ఎం బాలలింగయ్య, ఎఫ్‌ఏ పాల్గొన్నారు.